# ఎవరు అరిటాకు?

## శారదా అశోకవర్ధన్

"వెన్నెలరాత్రి, ఇది కన్నెల హృదయా
లను కదిలించే కమ్మని రాత్రి
వధూవరుల యెదల్లో వలపులు చిందించే
పసిడి వెన్నెలరాత్రి
మగువల మనసుల్లో మల్లెలు వికసించే
మధురమైన రాత్రి
పడుచుతనం పరవళ్ళు తొక్కే యువ్వ
నుల కది పండుగరాత్రి."

"యూ షటప్" దాదాపు అరిచినట్టుగా అన్నారు శ్రీనాథ్ చేతిలోని సిగరెట్టు పీకని ఆఖరిసారిగా పీల్చి యాష్ట్రేలో పడేస్తూ...ఆ కేకకి ఉలిక్కిపడ్డారు కుమార్, విజయ్‌లు శ్రీనాథ్ చిరాకుకి అర్థం తెలీక.

"ఏరా, మా కవిత్వం బాగులేదా?" అన్నాడు కుమార్. "వెన్నెల రాత్రి పిలుపు, కన్నెపిల్ల తలపు కమ్మని కవిత్వానికి మత్తెక్కవలసింది పోయి వెర్రివాడిలా అలా అరిచావేమిట్రా" అడిగాడు విజయ్

'అంతా అబద్ధం. ఆడదంటే అక్షరాలా బ్రహ్మరాక్షసి...భూతం...దెయ్యం..." పళ్ళు పటపటా కొరుకుతున్న శ్రీనాథ్ కేసి చూస్తూ మూగవాళ్ళలా గుడ్లప్పగించారు కుమార్, విజయ్‌లు.

కుమార్, విజయ్, శ్రీనాథ్ ముగ్గురూ ఒకే కాలేజీలో లెక్చరర్లు. ముగ్గురూ ఇంకా బ్రహ్మచారులే. ఒక్కచోట తిని ఒక్క రూములో ఉంటూ ఒకే కాలేజీలో పనిచేసుకుంటూ గడపడమే కాకుండా, ముగ్గురూ సినిమాహాలు దగ్గరా, కాఫీ హోటల్ దగ్గరా కూడా కలిసే కనబడ్డం వల్ల వీళ్ళని అందరూ త్రిమూర్తులు అంటారు. ఒకే మాటా, ఒకే బాటా అయిన త్రిమూర్తులకి భేదాభిప్రాయాలు వచ్చేదల్లా ఒక్క విషయంలోనే. ఆడపిల్లల పేరెత్తితే చాలు, మండిపడతాడు శ్రీనాథ్. ముక్కంటిలా ఉగ్రుడయిపోయి తాండవం చేసినంత పనిచేస్తాడు. సరదాగా ఆడపిల్లల గురించి జోక్స్ వేసుకునే కుమార్, విజయ్‌లు అది చూసి నోరుమూసుకుంటారు. ఆడపిల్ల కనబడితే ఏదో పెద్దపులిని చూసినట్టు ఆమడదూరం పారిపోతాడు శ్రీనాథ్. ఎంత ఆలోచించినా శ్రీనాథ్ మనస్తత్వం ఏమిటో

అర్థంకాలేదు కుమార్‌కి, విజయ్‌కి.

"వీడు పెళ్ళిచేసుకుంటే, పెళ్ళాన్ని ఒంటింట్లోంచి బయటికి రానివ్వడు కాబోలురా. షీ విల్ బి ఎ కుక్ నాట్-ఎ...వైఫ్."

"వీరితో కాపురంచెయ్యలేక విడాకులిచ్చి ఉడాయిస్తుంది. రెండోరోజే ఆ ఇల్లాలు" వీరి కామెంట్స్ వింటే ఒళ్ళు మండిపోయింది శ్రీనాథ్‌కి. ఇద్దర్నీ పీక నులిపి అవతల పడేయాలన్నంత కోపం వచ్చినా, ఏమీచెయ్యలేక అవతలికి వెళ్ళిపోయాడు. ఆరోజునుంచీ శ్రీనాథ్‌లోని ఈ ప్రవర్తనకు కారణం ఏమై వుంటుందా పరిశోధన చెయ్యాలని నిశ్చయించుకున్న కుమార్, విజయ్‌లకి ఈ రోజున అవకాశం దొరికింది. ఆడజాతి మీద అంత ద్వేషం దేనికో నిలదీసి అడిగారు. గత్యంతరంలేక శ్రీనాథ్ చెప్పడం మొదలెట్టాడు.

"అదొక చిన్న పల్లెటూరు. పేరు ఏటికొప్పాక. జిల్లా విశాఖపట్టణం. అక్కడ నాన్నగారు గవర్నమెంటు స్కూల్లో బడిపంతులు ఉద్యోగం చేస్తూ కాలం గడుపుతున్నారు. నాకు ఒక్క తమ్ముడూ ఇద్దరు చెల్లెళ్ళూ వున్నారు. మా పెద్ద చెల్లెలు సరోజ స్నేహితురాలే ఆ ఊరి కరణంగారమ్మాయి రాణి. పూర్తిపేరు సుధారాణి. హోదా అంతస్తు కులం, గోత్రం ఈ భేదాలేమీ మనసుకి పట్టకముందే వారి స్నేహం ముడిపడి పోవడంవల్ల రాణి అస్తమానం మా ఇంట్లోనే వుండేది. సరోజతో కబుర్లు చెబుతూ. నేనూ, సరోజ నేడిపించినట్లే ఆ అమ్మాయినీ ఆటపట్టించేవాణ్ణి. గంటలు గంటలు వాదించుకునేవాళ్ళం. అనేక విషయాలమీద. మరెన్నో గంటలు పేకాడుకునేవాళ్ళం. గంటలు నిమిషాల్లా దొర్లిపోయేవి-మా మధ్య. ఒకరోజు రాణి కనపడకపోతే మనసు గిలగిల్లాడి పోయేది. రాణి ఒక్కరోజు నన్ను చూడకపోయినా చేపపిల్లలా కొట్టుకుపోయేది. కాని అంతవరకూ తెలీలేదు మాకు యవ్వనపు తొలిపొంగులోని ఆకాంక్ష. ఆకర్షణ దానికి కారణమని. ఒకరోజున రాణి నాతో ఏదో రహస్యంగా మాట్లాడాలనీ, వాళ్ళ కొబ్బరితోట దగ్గర సాయంత్రం అయిదింటికి కలుసుకోమని చెప్పి చీటీరాసి, సరోజ చూడకుండా నా చేతిలో పెట్టి వెళ్ళిపోయింది. అంతకు ముందే రాణి రూపం నా కళ్ళలోనూ, రాణి ప్రేమ నా గుండెల్లోనూ నిండి పోవడంవల్ల, రాణి ఉత్తరానికి ఉబ్బి తబ్బిబ్బయి రాణిని కలుసుకునే శుభ ఘడియకోసం ఎదురుచూస్తూ క్షణమో యుగంలాగా గడిపాను. రాణిని నా భార్యా మణిగా ఊహించుకుని, మా భావి జీవి తాన్ని పూలపడవలా, పాలకడవలా, కమ్మని తియ్యని భావాలతో అల్లుకుంటూ తలపుల పొదరింట్లో రోజంతా గడిపే శాను. సాయంత్రం నాకున్న వాటిలో

మంచివనుకున్నవి పాంటూ షర్టూ వేసుకుని. నీటుగా తల దువ్వుకొని. కొబ్బరి తోటలకేసి నడిచాను. నవకన్యలా ముందుమంది రాణి. రోజూ మాట్లాడే రాణే అయినా, ఏదో భయం, పిరికితనం. గుండెలు కొట్టుకున్నాయి. ఆకాశం, సూర్యుడు, కొబ్బరిచెట్లు, పిల్ల గాలి అన్నీ కలిసి భయపెడుతూన్నట్లనిపించింది. కానీ, రాణి నవ్వు కొండంత ధైర్యాన్నిచ్చింది. ఉత్సాహంతో ముందుకు నడిచాను.

"వస్తావో రావోననుకున్నా" రాణిలోని మనసిగ్గు కొత్తగా అనిపించింది. కన్నార్పకుండా ఆమెకేసి చూస్తూండిపోయాను.

"నీతో ఎన్నో మాట్లాడాలి."

ఆమె మాటల్లోని మాధుర్యం నా హృదయంలో వెయ్యివీణలు మీటినట్లయ్యింది.

"ఏయ్...నిన్నే...మాట్లాడవేం?"

ఉలిక్కిపడ్డాను. "ఆ... అదే... దేనిగురించి?" నకనకా నవ్వింది రాణి, పిచ్చిగా చూస్తున్న నన్ను చూసి

"ఇంకా దేనిగురించి? మన గురించే, నేనంటే నీకిష్టమా?"

ఆ ప్రశ్నకు నా ఒళ్ళు ఝల్లుమంది. ఎంత ఇష్టమో నా గుండెలమీద తన చెవులానించి వినిపించాలనిపించింది. మనసు మాట్లాడే మూగభాష అలా చెయ్యలేక, "నువ్వంటే నాకెంతో ఇష్టం" అన్నాను అచ్చంగా తెలుగు సినిమా హీరోలాగా.

"అయితే నన్ను పెళ్ళిచేసుకోవడానికి నీకేం అభ్యంతరం లేదుగా?" సిగ్గు బరువుతో తల వంగిపోతోందేమో, నేల చూపులు చూస్తూ అంది.

"ఏమిటా పిచ్చిప్రశ్న? అందాలరాశివి. ఐశ్వర్యవంతురాలివి. అన్నింటినీమించి సుగుణవతివి, మనసిచ్చినదానివి. నిన్ను పొందే అర్హత నాకుందా లేదా అని ఆలోచించుకోవాలి. అన్నింటిలోనూ నీకన్నా తక్కువే. ముఖ్యంగా మీ అంతస్తూ, మా అంతస్తూ..."


"డార్లీ—అవేవీ అడ్డు రాకుండా నేను చూసుకుంటాను" అంది.

అంతలోనే అక్కడికి కెలా వచ్చారో కరణంగారు మమ్మలిద్దర్నీ మార్చిమార్చి చూశారు. ఆ చూపులు గునపాల్లా గుచ్చుకున్నాయ్ గుండెల్లో. నిప్పుకణాల్లా ఒళ్ళంతా కాల్చేస్తున్నాయ్.

ఏదో చెప్పబోయాను.

"హార్మయ్" అన్నారు చెంప చెళ్ళుమనిపిస్తూ, కళ్ళు బైర్లుకమ్మాయి. తమాయించుకుని కళ్ళు తెరిచేసరికల్లా చుట్టూ మూగిపోయారు జనం. కరణంగారి పక్కన మేకపిల్లలా నుంచుంది రాణి.

"తన్నండి వెధవని బాగా కొవ్వెక్కినట్టుంది సినిమాలో హీరోననుకున్నాడు కాబోలు, అమ్మాయిల వెంట తిరగడానికి" ఒక కంఠం పలికింది; వెంటనే ఒక దెబ్బ




పడింది.

"ఎన్ని గుండెలు! కోడి బడివంతుల కొడుకు, కరణంగారి అమ్మాయి వెనకే పడ్డాడూ... ఒళ్ళు పొగరు కాకపోతే..." మరో కంఠం మాట్లాడింది మరో దెబ్బ చుర్రుమంది.

"నేనేం వెంటబడలేదు. తనే నన్ను రమ్మంది" అన్నాను ఎలాగో గొంతు పెగుల్చుకొని.

"ఏం కూశావురా వెధవా! నా కూతురు నిన్ను రమ్మందా రాస్కెల్" అంటూ కాలితో డొక్కలో ఒక్క తన్ను తన్నాడు కరణం

"కావాలంటే అడగండి" అన్నాను, సమయానికి ఆ ఉత్తరం తన దగ్గర లేకుండా పోయినందుకు బాధపడుతూ.

"ఏమే విజయా!" ప్రశ్నించాడు కరణం...కాదు గర్జించాడు. ఆ గర్జన లోంచి సన్నగా వినిపించాయి మాటలు.

"లేదు...నేను రమ్మనలేదు అసలు.... నా కేం తెలీదు..." గుండె ఆగిపోయింది నాకు కరణంగారి దెబ్బకన్నా ఆమె మాటలు మరింత బాధపెట్టాయి.

"ఒక ఆడపిల్ల మీద అభాండాలు వేస్తావట్రా దౌర్భాగ్యుడా!"

"సిగ్గూ ఎగ్గూ లేదట్రా గాడిదా..."

"అమాయకురాలి జీవితంలో నిప్పులు పోద్దామనుకున్నావా, రాస్కెల్" మాటలూ తన్నులూ ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి.

ఎక్కణ్ణుంచొచ్చారో నాన్నగారు, కన్నీళ్ళతో కరణంగారి కాళ్ళు కడిగారు.

"నీ మొహం చూసి వదిలేస్తున్నానోయ్ పంతులూ. జాగ్రత్త! ఆడపిల్లల జీవితం అరిటాకులాంటిదని చెప్పు. వాళ్ళ నల్లరి పాలు చేసి చెలగాటం ఆడుకోవద్దని

"చెప్పు" అంటూ రాజీని వెంటబెట్టుకుని వెళ్ళిపోయాడాయన. మెల్ల మెల్లగా ఒక్కొక్కరూ జారుకున్నారు. ఆడపిల్లల దీన స్థితులను చర్చించుకుంటూ.

"పదరా భ్రష్టుడా... ఒక ఆడపిల్లని బజారు కెక్కించిన ఘనత నాకు దక్కించావ్. ప్రయోజకుడవయ్యావురా... నాకు చాలా గర్వంగా వుంది." నాన్నగారి ఒక్కొక్క మాటా చెప్పుచ్చుకుని కొట్టినట్టుంది.

"నాన్నా... మీరూ నమ్ముతున్నారా?"

"లేదురా... కళ్ళతో చూసింది భ్రమ అనుకుంటున్నాను."

"నాన్నగారూ! నిజంగా నన్నక్కడికి రమ్మని రాజే ఆ ఉత్తరం రాసింది."

"ఇంకా ఎందుకురా బుకాయిస్తావ్. ఏ ఆడపిల్లా మొగాడిలా ఉత్తరం రాయదురా. అందులోనూ పెళ్ళికావలసిన పిల్ల సంప్రదాయ కుటుంబంలోని పిల్ల ఛస్తే అలా రాయదు. చేసిన పనికి వెళ్ళి వాళ్ళ కాళ్ళమీద పడు" అంటూ అక్కడి నుండి నుంచి వెళ్ళిపోయారు.

నాలో ఆవేశం ముంచుకొచ్చింది. "కన్న కొడుకుని కూడా నమ్మనంత నమ్మకం ఆ పిల్లమీద ఎలా వచ్చింది మీకు" అన్నాను.

"నోర్మూయ్యరా కుంకా! ఇది తరతరాల అనుభవంరా. ఏదీ ఆ ఉత్తరం చూపించు" అన్నారాయన కొరాలు నూరుతూ. సరోజ చూస్తుందేమోనన్న భయంతో ఉత్తరం చించేశానన్న విషయం అప్పటికిగాని గుర్తుకురాలేదు నాకు. ఆ మాటే చెప్పాను.

"చాలా బావుందిరా, నువ్వు చెప్పేది. మొట్టమొదటి ప్రణయలేఖ చించేశావంటావ్, నన్ను నమ్మంటావ్?"

"నాన్నా"

"ఛీ... నన్నలా పిలవకు. ఒక స్త్రీలోలుడికి తండ్రినని చెప్పుకోవడంకన్నా చావు మేలు. పట్నంలో చదువుతున్నావ్ ఇదన్నమాట నువ్వు చదివే చదువు. ఇలా ఎంతమందిని ఆడించావో, ఏడిపించావో..."

నా నిస్సహాయ స్థితికి నామీద నాకే అసహ్యమేసింది ఆ రోజున మగాడినై పుట్టినందుకు మొదటిసారిగా నామీద నాకే జాలి కలిగింది. అసహ్యం వేసింది.

ఇంటికెళ్ళాక, ఎంత సేపు ఆ రాత్రి ఏడుస్తూ కూర్చున్నానో అప్పటికీ చెప్పలేను. ఇంట్లోవాళ్ళంతా నన్నో దోషిని చూసినట్టు చూశారు. సరోజ కూడా అసహ్యించుకుంది. అమ్మ మాట్లాడనేలేదు. మర్నాడు కాసేపు అలా ఊళ్ళోకెళ్ళేసరికి, ఆడవాళ్ళందరూ ఒక రౌడీని చూసి జడుసుకున్నట్లు పారిపోయారు. మగవారు ఒక పురుగును చూసినట్టు చూసేరు. ఆ చూపులు ఆ ప్రవర్తనా నా గుండెల్ని చీల్చేశాయి.

సెలవులయిపోతుండగానే ఇల్లొదిలి,

విశాఖపట్నం వచ్చేశాము. దాదాపు ఒక్క సంవత్సరం ఇంట్లోవాళ్ళెవ్వరూ నాతో సరిగ్గా మాట్లాలేదు. ఆడపాదడపా ఇంటి కెళ్ళినా, సరోజ పెళ్ళికి కట్నం సమస్య కారణమైనా సరోజ మాత్రం 'ఒక రౌడీకి చెల్లెలినయినందుకు ఆనాడు రాణికి నువ్వు అన్యాయం చేశావు కనుకనే నేనీ రోజున ఇలా ఏడుస్తున్నా" ననేది. నాన్నగారు మనోవ్యాధితో మంచం పట్టారు. ఏ సమస్యల్నీ తీర్చలేక, ఎవరికీ నిజాన్ని చెప్పలేక నాలో నేనే కుమిలిపోతున్నాను. మొన్నీమధ్యే రాణికి పెళ్ళయిందని తెలిసింది. అత్తవారింటికి వెళ్ళిపోయింది. కానీ నా మొహాన పడ్డ ముద్ర మాత్రం అలాగే మిగిలిపోయింది.

"ఇప్పుడు చెప్పండి. ఈ సమాజం ఆడదాని మాట నమ్మినంతగా మగవాడి మాట నమ్మదు. అందులోనూ పది మందిలోనూ కన్నీరు పెట్టగలిగితే చాలు. ఇక వాడి పని గోవిందః. కన్న తండ్రి కావచ్చు కట్టుకున్న మొగుడు కావచ్చు. మరెవరయినా కావచ్చు. ఆమె కన్నీళ్ళకి కరిగిపోయి అవతలివాడి భరతం పడతారు ఆడవాళ్ళకి భగవంతుడిచ్చిన ఆయుధం కన్నీళ్ళు" అన్నాడు. కన్నీరు రాకపోయినా అతని గొంతు దుఃఖంతో పొంగుకుపోయింది.

శ్రీనాథ్ చెప్పే మాటలన్నీ ఒక కథలాగా వింటూ కూర్చున్నారు కుమార్, విజయ్‌లు. శ్రీనాథ్ మీద జాలి కలిగింది. మనసు వికలమయిపోయింది.

"ఒరేయ్... ఆడదాని బ్రతుకు అరిటాకు లాంటిదంటారు కానీ మగవాడి బ్రతుకు ఏ ఆకు అనాలిరా" అన్నాడు కుమార్, బాధపడుతూ.

"కనీసం ఆడదానిపట్ల సానుభూతి చూపుతుంది లోకం. మొగాడిమీద అదీ వుండదు" అన్నాడు విజయ్ తనూ బాధ పడిపోతూ.

గడియారం పన్నెండు కొట్టింది. బయట వెన్నెలరాత్రి చల్లదనం కన్నా, గుండెలోపలి వేడిమి ఎక్కువయినట్లు అనిపించింది. వెన్నెలని చూస్తే చిరాకు పుట్టింది. దీపం ఆపేసి మాట్లాడకుండా పడుకున్నారు ముగ్గురూ, మగవాళ్ళ కష్టాల గురించి మథనం చేసుకుంటూ.

